# విముక్తి

**అ**న్నం తిన్నప్పట్నుంచీ బీడీ తాగాలని చాలా ఇదిగా ఉంది వెంకటప్పకు. నోరంతా పీకుతూ వుంది. ఇంట్లో గూళ్ళన్నీ వెదికాడు. దారి తప్పి దాక్కున్నాయేమోనని. ఉంటేగా దొరకటానికి. ఉండవని వెంకటప్పకూ తెలుసు. చికాకుగా బయటికొస్తాంటే భార్య, "రేపు యెసిట్లేకి యేంటివీ లేవు.  ఆ రంగప్పనన్నా యిన్ని గింజలడుగు. మూడు రోజుల్నుంచీ చెప్పుతావుంటే చెవిలోకే యేసుకోకుండా వుండావు.." అంటూ హెచ్చరించింది. వెంకటప్పకు గుండెల్లో రాయిపడ్డట్టయింది. మౌనంగా తలూపి వీధిలోకి  వచ్చాడు.

నాగులకట్ట మీదికొచ్చి  కూచున్నాడు వెంకటప్ప. కట్టమీద ఇద్దరు పులిజూదం ఆడుతూంటే, అయిదారుగురు చుట్టూ కూచుని చూస్తున్నారు. వెంకటప్ప అందర్నీ పరకాయించి చూశాడు. బీడీలయితే అందరూ తాగే వాళ్ళే! ఎవర్నీ అడగటానికి మనసొప్పలేదు వెంకటప్పకు.  కట్టపక్కనున్న పెట్టంగడిలో ఏవో లెక్కలు చూసుకుంటూ కూచొనున్నాడు రామయ్య. ఆ అంగడిలో బీడీలూ, సిగరెట్లూ, అగ్గిపెట్టెలూ, పిల్లలు తినే తినుబండారాలు లాంటివి ఉంటాయి. వెంకటప్ప  కట్టదిగి దగ్గరగా వచ్చి "రామయ్యా! ఒక బీడీలకట్టా, అగ్గిపెట్టీ యియ్యప్పా!"  అనడిగాడు. రామయ్య వెంకటప్ప ముఖంలోకి అరక్షణం చూసి మళ్ళీ తన  పనిలో మునిగిపోయాడు. ఆ చూపు వెంకటప్పకు చాలా అర్థాలే చెప్పింది. ఒక నిముషమాగి "రామయ్యా" అన్నాడు మళ్ళీ.

రామయ్య వెంకటప్పకేసి చూసి, "యీటికే పది రూపాయల పైన యియ్యాల్ల నువ్వు వెంకటప్పా!" అన్నాడు.

"ఇస్తాలేవయ్యా" అన్నాడు తేలిగ్గా వెంకటప్ప.

"నువ్విస్తావప్పా! మాకీడ జరగల్లగదా! యాటికని అప్పులిచ్చేది" అన్నాడు రామయ్య,

వెంకటప్పకు చ(క్రుమంది. వీడికి కూడా తను అలుసైపోయినాడు. ఎన్నిసార్లు వీడు తన దగ్గర గింజాగిట్రా తీసుకోలేదు. ఎన్నిసార్లు తమ తోటలో కూరా నారా తినలేదు? వీడి అంగడంతా చచ్చిన నా ఎనుగొడ్డు ఎలవలే... వీడికీ బడాయే"

అనుకొన్నాడు. ఒక నిముషమాగి ఇంకేం మాట్లాడకుండా వచ్చి మళ్ళీ కట్టమీద కూచొన్నాడు వెంకటప్ప.

మధ్యాన్నం ఎండ కొంచెం ఏటవాలింది. నాగులకట్ట మీద వేపచెట్టు నీడలు కదులుతున్నాయి. చెట్టుమీద కాకులు సందడి చేస్తున్నాయి. వీధిలో మనుషులు అటూ యిటూ వస్తూపోతూవుంటే పరధ్యానంగా చూస్తున్నాడు వెంకటప్ప... ఎదురుగా వీధి మలుపులో ఆడవాళ్ళు బోరింగ్‌ను టక్‌టక్ మని గట్టిగా కొడుతున్నారు. పది నిమిషాలు కొట్టినా ఒక కడవ నిండటం లేదు. ఒక కడవ నింపటానికి ఇద్దరు మార్చి మార్చి కొడుతున్నారు. ఆ బోరింగ్‌ను చూస్తూంటే తన బావిలో వేయించిన బోరింగ్ గుర్తువచ్చి నిట్టూర్పు విడిచాడు వెంకటప్ప.

మూడెకరాల మడి ఎండిపోతూంటే తానూ వేయించాడు బోరింగ్. సంవత్సర సంవత్సరానికీ బావిలో నీళ్ళు తగ్గిపోతూ వుంటే 'వేయిద్దాం వేయిద్దాం' అనుకుంటూ తనే తాత్సారం చేశాడు. తీరా మడి నాటినాక రెండు రోజులకు కూడా ఒక ఎకరా పారటం కష్టమయిపోతోంది. ఊళ్ళోకి బోరింగ్ మిషను వస్తే ధైర్యం చేసి వేయించాడు. ఎనభై అడుగులు దించితే రెండించులు నీళ్ళు పడ్డాయి. 'బోర్ ఫిటప్పు చేయిస్తే నీళ్ళు బాగా వస్తాయి' అంటే అట్లాగే చేయించాడు. రెండు నెలలు ధార తగ్గకుండా నీళ్ళు వచ్చాయి. ఇంతలోనే తన తోట ఎగువన రాజప్ప కూడా బావిలో బోర్ వేయించాడు. రాజప్పకు మూడించుల నీళ్ళు పడ్డాయి. అంతే! ఏదో మంత్రం వేసినట్టు తన బోర్‌లో నీళ్ళు 'టక్' మని నిల్చిపోయాయి. నాలుగురోజులు తేరుకోలేక పోయాడు తను! ఆ తరువాత ఏవేవో ప్రయత్నాలు చేశాడు. ఏం చేసి ఏం లాభం? నీళ్ళ దారిన నీళ్ళు పొయ్యాయి. మడితోవన మడి ఎండకపోయింది. శెనక్కాయ పంటరాగానే వేస్తానని సత్యమయ్య దగ్గర తీసుకొచ్చిన నాలుగు వేల అప్పు మాత్రం నికరంగా మిగిలిపోయింది. తోటలో ఓ మూల 'సర్ఫేస్ బోర్' వేయిస్తే నీళ్ళు పడతాయని ఎవరో ఆ తరువాత చెప్పినారు. అంత పెద్ద 'జూదం' ఆడటానికి తన మనసొప్పటం లేదు. మళ్ళీ అయిదారు వేలు ఖర్చు వస్తుంది. తీరా ఖర్చుపెట్టి వేయిస్తే ఆ నీళ్ళు గ్యారంటీ ఏముందీ? చేసేది లేక చేతులెత్తేశాడు తను.

ఇదంతా గుర్తుకు వచ్చి అతని ముఖంలో దీనత్వం కదలాడింది. గుండెలదరుతున్న శబ్దం చెవులకే వినిపించింది.

"ఏం మామా? ఆసారుగా కూచ్చుండావు?" అతని పక్కనే కూచుంటూ అప్పుడే అక్కడికి వచ్చిన రంగప్ప అన్నాడు.

వెంకటప్ప తలతిప్పి అతని ముఖంలోకి చూసి "ఇంతకంటే పనేముందోయ్! పొద్దు పోవటమే కష్టమైపోయింది. తినటమూ తిరగటమూ అయింది బతుకు" అన్నాడు  చిన్నగా నవ్వుతూ.

రంగప్ప బనీను జేబులోంచి రెండు బీడీలు బయటకు తీసి ఒకటి వెంకటప్పకిచ్చి తను ఒకటి వెలిగించుకున్నాడు. వెంకటప్ప ఎంతో అప్యాయంగా బీడీ రెండు దమ్ములు లాగి తన్మయత్వంలో మునిగాడు.

"శెనిక్కాయ అరవై అయిందంట...." పెరిగిన రేటును చెపుతూ బీడీ పొగ వదిలాడు  రంగప్ప.

"మన దగ్గర పంట లేనపుడు అరవై అయితే ఏం? నూరైతే ఏం?" నిర్వేదంగా అన్నాడు వెంకటప్ప.

"యా మాత్రం అమ్మినావు మామా?"

"ఏందమ్మడంలే! అంతా ఇరవై మూట్లు కాలే?" అన్నాడు వెంకటప్ప తన పంట గుర్తుకొచ్చి.... మూడు మూట్ల విత్తనాలు వేస్తే ఇరవై మూటల కాయలైనాయి తనకు. పంట కళ్ళంలోకి రాగానే వచ్చి కూచున్నాడు సత్యమయ్య. యాభైనాలుగుకు రేటు తెంచుకొని అమ్మేశాడు తను. అమ్మినాడన్న మాటేగాని తన చేతికి పైసా వచ్చింటే గదా! బోరుకు తెచ్చిన అప్పుకు అయిందంతా కట్టుకొని ఇంకా రెండువందల అప్పు చూపించాడు సత్యమయ్య. ఇప్పుడు రేటు ఎంత పెరిగితే ఏం లాభం! పంటకు పురుగుపట్టకుండా వుంటే అథమం అరవై మూటలన్నా అయ్యేవి. అయిన పంటకు ఖర్చులెల్లలే... మూడేళ్ళయింది బొత్తిగా పంటలేక! బావిలో నీళ్ళు లేక, చేన్లో పంటలేక, చేసేకి పనిలేక, కడాకు పూట పూటకూ తిండి గింజలకు ఎంపర్లాడుకొనే పరిస్థితి వచ్చింది! చేతనైన  చోటల్లా తెచ్చి పడేసి ఇంతకాలమూ నెట్టుకొచ్చాడు... ఆటికీ తన భార్య కన్నవస్థలూ పడుతోంది, సంసారం వెళ్ళదీయడానికి. ఎనుము ఇచ్చేపాలను, ఇంటికి ఒక చుక్క వాడుకోకుండా, హైస్కూల్ అయ్యావార్లకు పోస్తుంది. అన్నో యిన్నో నీళ్ళు కలిపి.  వాళ్ళిచ్చే చిల్లర డబ్బుతో సంసారాన్ని గుంభనంగా నెట్టుకొస్తోంది. ఇంట్లో వూరికే  కూచొని తినేవాళ్ళు ఆరుగురుండారు. పెద్దకొడుకు చూస్తే పనేం లేక నులకలు పేడుతూ కూచున్నాడు. రాను రాను ఏ రోజు కారోజు గండంలా కనిపిస్తోంది. కచ్చితంగా రేపెట్లా వుంటుందో వూహించుకోలేకపోతున్నాడు. ఈ మాట అనుకుంటూవుంటే "రేపు యెసిట్లేకి యేంటివీ లేవు" అన్న భార్య మాటలు భయంకరంగా గుర్తు కొచ్చాయి వెంకటప్పకు. రంగప్ప నడగమంది గింజలు. ఆ రంగప్ప పక్కనే వున్నాడు. రంగప్ప బతుకూ తనలాంటిదే. కాకపోతే రెండెకరాలకు

ఇంకా నీళ్లు పారుతున్నాయి. రంగప్పదీ పెద్ద ఖర్చున్న సంసారం. ఇద్దరు చెల్లెల్లు. ఇద్దరు తమ్ముళ్ళు. ముసలి తల్లీ తండ్రి, భార్య పిల్లలూ. రంగప్ప కష్టాలు రంగప్పవి! ఇప్పటికే రంగప్ప దగ్గర రెండు మూటలు రాగులు బదులు తీసుకొని మూడు నెలలయింది. మళ్లీ ఏ మొగం పెట్టుకొని అడుగుతాడు? అయినా అడగక తప్పని పరిస్థితి. రంగప్ప కన్నా తనకు దగ్గర వాళ్ళెవరున్నారు?

"ఇంట్లో యేమన్నా గింజలుండాయేంరా?" బలహీనమైన స్వరంతో నెమ్మదిగా అడిగాడు వెంకటప్ప.

"యాడుండాయి మామా! ఆరుమూట్ల రాగులూ, మూడుమూట్ల జొన్నలూ వారం కిందట రామస్వామికి కొల్చేసినాను. ఆ సీతారామయ్య ఎరువుల లెక్కకు ఒకటే తిరగటం! మడి చూస్తే యింకా కొయ్యనేలేదు. అదేం రోగమో! అంతా లొత్త... పది మూట్లు కూడా అయ్యేట్టు లేవు" అన్నాడు రంగప్ప.

'ఎందుకడిగానా' అని తన్ను తాను తిట్టుకోలేదు వెంకటప్ప.... "ఏం చేస్తే బాగుంటుంది. ఎవర్నడిగితే బాగుంటుంది" అని తీవ్రంగా గుణించుకుంటూ కూచున్నాడు.

ఒక ఎర్రటి కరపత్రం చేతిలో పట్టుకొని తనలో తాను చదువుకుంటూ కట్ట దగ్గరకు వచ్చాడు ఆదినారాయణరెడ్డి. అతడు బి.ఏ. రెండుసార్లు ఫేయిలయి మూడోసారి కూచోటానికి నెలలో మూడు వారాలు అనంతపురంలో, ఒక వారం సొంత వూళ్ళో కాలక్షేపం చేస్తూ ఉన్న డబ్బు లరగదీసే ప్రయత్నంలో ఉన్నాడు ప్రస్తుతం.

"ఏందిరా అది?" పులిజూదం గుంపులోవున్న నారాయణాచారి అడిగాడు.

"ఎవురో బస్సులో యిచ్చి పొయ్యినారు మామా! కమ్యూనిస్టు పార్టీ వాళ్ళది. భూమి కోసం భుక్తి కోసం పోరాటానికి యిచ్చిన పిలుపు" అన్నాడు ఆదినారాయణరెడ్డి.

ఆ మాట వింటూనే ఫక్కున నవ్వొచ్చింది వెంకటప్పకు. "యీ కమ్యూనిస్టు పార్టీవాళ్లకు బుద్ధే లేదు. ఎన్నేండ్లొచ్చినా ఒకటే అరుపులే. యింకా భూమికోసం పోరాటమంట. భూమి నెత్తిన కొట్టుకొని ఏం చెయ్యల్లో! భూములుండే వాళ్ళంతా రాజ్యాలు భోంచేస్తా వుండారుగావల్లు! యీ వూళ్ళో భూమి లేనోడెవుడు? వుండి బాగుపడినోడెవుడు? అయిదెకరాల నా తోటా, ఇరవై యకరాల మెట్టా యా పోరాటమూ లేకుండా వీళ్ళకిస్తా.... ఎంత మందికి బుక్తి గడుస్తుందో సూడల్ల! వీళ్ళకు వీళ్ళ అరుపులేగాని దేశ మెట్లయిందీ తెలిస్తే గదా! యాడో టౌన్లో కూచుని అరుస్తారు... తాగటానికే నీళ్ళు లేకుండా సస్తావుంటే భూమి కోసం పోరాటమంట. నన్నడిగితే భూమిని వదిలించుకొనేదానికి చెయ్యల్ల పోరాటం!" అని గొణుక్కున్నాడు వెంకటప్ప.

ఒకరిద్దరు ఆ పేపరును లాక్కొని, ఆడ రెండూ, ఈడ రెండూ వాక్యాలు చదివి, నలిపి దూరంగా విసిరేశారు.

పది నిమిషాల తర్వాత కట్టదిగి వీధిలోకి వచ్చి రెండు నిమిషాల పాటు నిలబడ్డాడు వెంకటప్ప. అటూ యిటూ దీర్ఘంగా చూసి, మెల్లగా అడుగులు వేస్తూ నడిచాడు, వెనకల చేతులు కట్టుకొని... వీధికి ఆవేపూ ఈవేపూ చూస్తూ రామాలయం దగ్గరకు వచ్చాడు. గుడి ముందు బండమీద జనం... గుడి కెదురుగా వున్న హోటల్ పాకలో జనం.... దాని పక్కనున్న పెట్టంగడి ముందు జనం... ఎక్కడ చూసినా జనం... జనం... వీళ్ళేవరికీ తనలాగే పనులు లేవేమో! అయినా పనులేమున్నాయని! పదేళ్ళ క్రితం మధ్యాహ్నం పూట వీధుల్లో మగమనిషన్నవాడు కనిపించేవాడు కాదు. ఇప్పుడో వీధుల్లో తిరగటమే అందరికీ పని! ఊళ్ళో బావులన్నీ ఎండిపోయి తోట పనులసల్లేవు. ఒకప్పుడు అరవై బావులకింద మూడువందల ఎకరాల సాగుబడి ఉండేది. ఇప్పుడంతా లెక్కవేసినా యాభై ఎకరాల సాగు కూడా లేదేమో! మనుషులింక వీధుల్లో ఉండక యాటికి పోతారు? ఇంట్లో వుంటే భయంకరమైన సమస్యలు. ఆశ్చర్యమనిపించలేదు వెంకటప్పకు. తనలాగే అందరూ, అందరిలాగే తనూ అనిపించి, ఆనందమే కలిగింది.

మధ్యాన్నం స్కూలు విడిచారేమో, గుంపులు గుంపులుగా పిల్లలు ఇళ్ళకు వెళ్తున్నారు. ఆ గుంపుల్ని చూస్తూంటే ఈ ఊళ్ళో ఇంతమంది పిల్లలున్నారా అనిపించింది. ఈ పిల్లలంతా రేపు ఏమవుతారు? ఏం చేస్తారు? ఏం తింటారు? అన్న చిత్రమైన ఆలోచన వచ్చి భుజాలు ఎగరేసుకున్నాడు వెంకటప్ప.

"నాయనా" అంటూ అతని చిన్న కొడుకు వచ్చి చేయి పట్టుకున్నాడు. వాడికి పదేళ్ళుంటాయి. ఐదో తరగతి చదువుతున్నాడు. వెంకటప్ప కొడుకు ముఖంలోకి ప్రేమగా చూశాడు.

'ఒక పావలా యీ నాయ్నా" గోముగా అడిగాడు వాడు.

వెంకటప్ప వాడి భుజం మీద లాలనగా చేయి వేసి, లేవని తెలిసీ జేబులు తడుముకుని "లేవు గదరా? ఇంటికి పొయ్యి మీయమ్మ నడుగు" అన్నాడు నిధులన్ని వాళ్ళమ్మ దగ్గర దాచినట్టు.

"అమ్మ కొడుతుంది. నువ్వే యీ నాయ్నా" అంటూ మారాం పెట్టాడు.

"ఇప్పుడు లేవురా. మళ్ళీ యిస్తాపో..." నాలుగు అబద్ధాలు చెప్పి వాణ్ణి వదిలించుకున్నాడు.

వాడటు వెళ్ళగానే పెద్ద విషాదంలో పడిపోయాడు వెంకటప్ప.

"ఏం వెంకటప్పా! బాగుండావా?" అంటూ ఎదుట నిలబడ్డచెట్టంత మనిషిని చూశాడు వెంకటప్ప... ధర్మవరం బట్టలంగడి రాధాక్రిష్టయ్య.

వెంకటప్ప ముఖం మీద చిరునవ్వు అతికించుకుని "ఏదో మీ దయ" అన్నాడు.

"మా దయేముందప్పా! మీ దయ మీద బతికే వాళ్ళం.... అవును గానీ ఏమన్నా జమ యీయకూడదా" అన్నాడు.

వెంకటప్ప నిర్వికారంగా నిలబడ్డాడు.

"అంతో యింతో యిస్తే బాగుంటుంది వెంకటప్పా. సాయంత్రం మళ్లీ యింటికాడ కలుస్తా" అంటూ వెళ్ళిపోయాడాయన.

"ఎప్పుడు కలిసినా నా దగ్గరుండల్ల గదా..." గొణుక్కున్నాడు వెంకటప్ప.

సాయంత్రం వరకూ పిచ్చిపట్టినట్టుగా వూరంతా చెడ తిరిగాడు. అక్కడ కొంతసేపు. ఇక్కడ కొంతసేపూ కూచుని పొద్దు గడిపాడు. అతని మనసు అతన్ని ఎక్కడా స్థిరంగా నిలువనీయలేదు. ఎక్కడ కూచున్నా ఇల్లు గుర్తుకొస్తోంది భార్య చెప్పింది గుర్తుకొస్తోంది.. రేపు గుర్తు కొస్తోంది.

తన అవసరం తీర్చగలవాళ్ళెవరూ అని ఎందర్నో గుర్తు తెచ్చుకున్నాడు. ఎవరి దగ్గర తను బదుళ్ళు తీసుకున్నదీ గుర్తు తెచ్చుకున్నాడు. ఒకరిద్దర్ని అడిగి లేదనిపించుకున్నాడు. అతని ఆలోచనల్లో ఇక ఎవ్వరూ మిగలలేదు. రేపు మాత్రం మిగిలింది.

అతనికి తెలియకుండానే అతని కాళ్ళు నడుస్తున్నాయి. పొలాలు దాటుకుంటూ వూరి బయటికొచ్చాడు. పడమటి పొద్దు బాగా ఎఱ్రబడింది. నడుస్తున్న ఎఱ్రమట్టి రోడ్డు మరింత ఎఱ్రగా మెరుస్తోంది. అతని కెదురుగా ఒక గుంపు... అందరి భుజాల మీదా మట్టి తవ్వే పరికరాలూ, గంపలూ....

"యాటికన్నా అసలు సందెకాడ యెల్లబారినావు" గుంపులో ఎవరో పలకరించారు వెంకటప్పను.

"ఏం పనిమీద పొయ్యింటిర్రా" అని యదాలాపంగా అడిగాడు వెంకటప్ప.

"రోడ్డు పనికి పొయ్యింటిమన్నా..."

"ఎవరు చేపిస్తావుండార్రా రోడ్డు పని"

"నాగేశమయ్య చేపిస్తా వుండాడన్నా"

"యా మాత్ర మిస్తారు?"

"రోజు పది యిస్తారన్నా" అన్నాడొకరు నిలబడి.

"మీపనే బాగుంది కదరా" అంటూ కదిలాడు వెంకటప్ప.

రోడ్డు కొసదాకా వెళ్ళి గిరుక్కున వెనక్కు తిరిగాడు వెంకటప్ప. ఎన్నాళ్ళుగానో అంతరాంతరాల్లో మెదులుతున్న ఏదో ఆలోచన పైకి ఎగదన్ని, అతడి మెదడులో గింగుర్లు తిరగసాగింది. అతని కాళ్ళు చకచకా వూళ్ళోకి నడిచాయి.

మసక చీకటి బాగా ముసురుకుంది. ఊళ్ళో దీపాలు వెలుగుతున్నాయి. వెంకటప్ప కాళ్ళు వేగంగా నడచి ఒక వీధి మొగలో ఆగిపోయాయి.

అయిదు నిమిషాలపాటు అక్కడే నిలబడ్డాడు వెంకటప్ప. అటూ యిటూ తచ్చాడి ఆ వీధిలో నడవడం ప్రారంభించాడు. వందగజాలు నడిచి ఒక యింటి ముందాగాడు. ఆ యింటి ముందు వసారాలో ఒక బల్బు తెల్లగా వెలుగుతోంది.

నడవలోకి వచ్చి నిలబడి లోపలివేపు చూశాడు వెంకటప్ప. లోపల నలుగురైదుగురు యింటి మనుషులు  కనిపించారు.

"నాగేశమూ...." అని మెల్లగా పిలిచాడు.

"ఎవరూ" లోపల్నుండి ఓ గొంతు.

రెండు నిమిషాలు నిశ్శబ్దం...

"నాగేశమూ...." మళ్ళీ పిలిచాడు.

లోపల్నుండి నాగేశమయ్య బయటకొచ్చాడు. నలభైఏళ్ళ  వయసు. నల్లటి శరీరం, తెల్లటి బట్టలు.

నడవలోకి వచ్చి వెంకటప్పను చూసి, "ఎవరూ? వెంగటప్ప  చిన్నాయనా? కూచో చిన్నాయనా..." అన్నాడు అరుగు చూపిస్తూ.

"నీతో పనుంది నాగేశమూ?" అన్నాడు అతి మెల్లగా.

"ఏం పని చిన్నాయనా?"

వెంకటప్ప అతని ముఖంలోకి నింపాదిగా చూస్తూ. "ఏం లేదు నాగేశమూ, ఒక యాభై రూపాయలుంటే సర్దు" అన్నాడు

నాగేశమయ్య ఒక క్షణం నిశ్శబ్దంగా వుండి "నాకూ శానా కసాలాగా వుండినప్పుడే  అడిగినావే! రోడ్డు పని వొకటి పెట్టుకొని శానా యిబ్బంది అయింది చిన్నాయనా! రోజూ రోడ్డు కూలోళ్ళకు యిచ్చేకే యాడుండేదీ చాలకొస్తావుంది. ఏమీ అనుకోకు..." అంటూ యింకా ఏదో చెప్పబోయాడు.

"నాకేం అప్పుగా యియ్యద్దు నాగేశమూ!  రేపట్నుంచీ నేనూ,  నా పెద్దకొడుకూ రోడ్డుపనికి వస్తాం..." అంటూ తటాలున తలదించుకున్నాడు వెంకటప్ప.  తనకంటి పొరలమీద నిల్చిన తడి కన్పించకుండా.

❖ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక **16-9-1987**